సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

అంతటా చవితి శోభ

- జనంతో మార్కెట్, రైతుబజార్లు కిటకిట
- కొండెక్కిన పూలు, పండ్ల ధరలు



రైతుబజార్‌లో పండ్ల స్టాల్ వద్ద జనం



ఎంవీపీ రైతుబజార్‌లో పూల స్టాల్ వద్ద వినియోగదారుల రద్దీ

ఆరిలోవ: వినాయక చవితి పర్వదినానికి వేళయింది. సోమవారం గణపతిని భక్తిశ్రద్ధలతో కొలిచేందుకు భక్తులు సిద్ధమయ్యారు. పూజా సామగ్రి విక్రయాలతో మార్కెట్లు, బజార్లు చవితి శోభన సంతరించుకున్నాయి. నియోజకవర్గంలోని ఎంవీపీ, పెదవాల్తేరు రైతుబజార్లలో శుక్రవారం రద్దీ పెరిగింది. పూజా సామగ్రి కొనేందుకు వినియోగదారులు అధిక సంఖ్యలో రైతుబజార్‌కు చేరుకున్నారు. వ్యాపారులు చామంతి, గులాబి, బంతి తదితర పూలు రాసులుగా పోసి విక్రయించారు. పత్రి, అరటాకులు, అరటి మొక్కలు, వెలగకాయలు, జామ, నారింజ, జొన్న పొత్తులు, కొబ్బరి పువ్వు, చెరకు గడలతోపాటు బత్తాయి, కమలాలు, అరటి పళ్లు, ద్రాక్ష, యాపిల్ తదితర వాటి విక్రయాలు జోరుగా సాగాయి. వాటి ధరలు కూడా బాగా పెరిగిపోయాయి. దీంతోపాటు బయట మార్కెట్లు కూడా వినాయక చవితి పూజా సామగ్రి విక్రయాలతో రద్దీగా మారాయి. ఆరిలోవ బాలాజీనగర్, టీఐసీ పాయింట్, అంబేడ్కర్ జంక్షన్, రవీంద్రనగర్, తోటగరువు, ఆదర్శనగర్, విశాలాక్షినగర్ ప్రాంతాల్లో పూజ సామగ్రి, పళ్లు, పూలు, వినాయక ప్రతిమలు విక్రయాలు, వాటిని కొనడానికి వెళ్లిన వినియోదారులతో సందడిగా మారాయి.



బజారులో విక్రయిస్తున్న చెరుకు గెడలు



హెచ్‌బీ కాలనీలో విక్రయిస్తున్న పూజా సామగ్రి

భలే గిరాకీ..

మద్దిలపాలెం: వినాయక చవితి పూజా సామగ్రి కొనుగోలుకు భక్తులు పోటెత్తి రావడంతో మార్కెట్లు, బజార్లు, ప్రధాన కూడళ్లు కిటకిటలాడాయి. మద్దిలపాలెం, హెచ్‌బీ కాలనీ, ఇసుకతోట తదితర ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పూజా సామగ్రి, గణపతి మట్టి విగ్రహాలను విక్రయించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన దుకాణాలు, స్టాళ్ల వద్ద జనంతో సందడి నెలకొంది. నేరేడు, మారేడు, జిల్లేడు, జామ, పనస, తులసి, యలమ, గరికి పత్రుల విక్రయాలు జోరుగా సాగాయి. చామంతులు, గులాబీలు, కలువపూలు, తమలపాకులు, కొబ్బరికాయలు, అరటిపండ్లు, మావిడాకుల ధరలు ఇష్టానుసారంగా పెంచి విక్రయించారు. పూజా సామగ్రితోపాటు మట్టి వినాయక ప్రతిమలను భక్తులు కొనుగోలు చేశారు.

నమో విఘ్నేశ్వరాయ



- నేడు వినాయక చవితి పర్వదినం
- పూజలకు సిద్ధమైన ఆలయాలు
- ముస్తాబైన మండపాలు, పందిళ్లు



కృష్ణా కళాశాల లక్ష్మీగణపతి ఆలయం వద్ద రూపొందించిన హోమశాల

మద్దిలపాలెం/బీచ్‌రోడ్డు: గణపతి ఉత్సవాలకు తూర్పు నియోజకవర్గంలోని వార్డులు ముస్తాబయ్యాయి. సోమవారం వినాయక చవితి పర్వదినం కావడంతో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ మేరకు యువత అద్భుతమైన మండపాలను రూపొందించారు. ఉత్సవ నిర్వాహకులు, కమిటీల కుర్రాళ్లు ఏర్పాట్లు పూర్తి చేశారు. వీధుల్లో వివిధ రకాల చూడచక్కని మండపాల సెట్టింగులు, పందిళ్లు వేశారు. ఆలయాలను సుందరంగా ముస్తాబు చేశారు. మద్దిలపాలెం కృష్ణా కళాశాల దరి లక్ష్మీగణపతి ఆలయం వద్ద హోమాల నిర్వహణకు హోమశాల రూపొందించారు. రెల్లి వీధిలో వినూత్నంగా మండపం సిద్ధం చేశారు. 28వ వార్డు రామ్‌నగర్‌లో కేఆర్ఎస్ కూల్ గైస్ అద్భుతమైన గోపురం మండపాన్ని నిర్మించారు. ఇది స్థానికులను ఆకట్టుకుంటోంది. శుక్రవారం అధిక సంఖ్యలో వినాయక విగ్రహాలను మండపాలు, పందిళ్ల వద్దకు ఉత్సవ నిర్వాహకులు తరలించారు.



గణనాథుడి విగ్రహాన్ని మండపానికి తరలిస్తున్న కమిటీ సభ్యులు



రెల్లి వీధిలో వినూత్న మండపం



రామ్‌నగర్‌లో ఆకట్టుకుంటున్న మండపం

క్లుప్తంగా

100 మందికి కంటి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు చినగదిలి నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయంలో శుక్రవారం శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. చినగదిలి, సంతపాలెం, దీన్‌దయాల్‌పురం, సూర్యతేజానగర్ తదితర ప్రాంతాల నుంచి సుమారు 100 మందికి వైద్య సేవలందించారు. కంటి వైద్య పరీక్షలతోపాటు మధుమేహం, బీపీ, రక్త పరీక్షలు చేశారు. వారిలో 25 మందిని కేటరాక్ట్ ఆపరేషన్ కోసం ఎంపిక చేసినట్టు శంకర్ ఫౌండేషన్ డాక్టర్ సుచిత్ర తెలిపారు. వారికి శంకర్ ఫౌండేషన్‌లో రెండు, మూడు రోజుల్లో ఉచితంగా కంటి ఆపరేషన్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం చైర్మన్ వానపల్లి అప్పారావు, చీఫ్ సెక్రటరీ ఆర్.ఎ పాత్రో, మంగరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలపై వినతి



కేంద్ర సహాయ మంత్రి జార్జ్ కురియన్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎంవీపీకాలనీ: రాష్ట్రంలో మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ మత్స్యకార సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఉమ్మిడి మహేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని ఓ హోటల్‌లో కేంద్ర మత్స్యకార, పశు సంవర్ధక, పాడి పరిశ్రమ, మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జ్ కురియన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో మత్స్యకారుల సంక్షేమం, వేటలో ఆధునిక విధానాల అమలు, ఆర్థికంగా మత్స్యకారుల బలోపేతం వంటి పలు అంశాలను వినతిపత్రంలో ప్రస్తావించినట్టు మహేష్ తెలిపారు. ఈ నెల 21న ప్రపంచ తీరప్రాంత పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న కార్యక్రమ పోస్టర్‌ను మంత్రి జార్జ్ కురియన్ చేతుల మీదుగా విడుదల చేశారు. ఎస్ఎఫ్‌డీబీ గవర్నింగ్ బాడీ సభ్యుడు కోలంగారి పోలయ్య, సంస్థ ప్రతినిధి పరిమెళ్ల వాసు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు



ఎంవీపీకాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు శుక్రవారం రాత్రి వర్సిటీలోని పలు హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఏయూ ప్రాంగణాన్ని ర్యాగింగ్ ఫ్రీ క్యాంపస్‌గా తీర్చిదిద్దడంలో భాగంగా వీసీ ఆచార్య శశిభూషణరావు ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల రీసెర్చ్ స్కాలర్స్ వసతి గృహం, ఇంజినీరింగ్ విద్యార్థుల వసతి గృహాల్లో తనిఖీలు చేశారు. ఏయూ రెక్టార్ ఆచార్య కిషోర్‌బాబు, వార్డెన్లు ఆచార్య మునిస్వామి, ఆచార్య చిట్టిబాబు, ఆచార్య రమేష్‌బాబు, ఆచార్య హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార ప్రాధాన్యంపై వైజ్ఞానిక ప్రదర్శన

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ గాయత్రి విద్యా పరిషత్ కళాశాల ఆవరణలో బయో కెమిస్ట్రీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం పౌష్టికాహార ప్రాధాన్యంపై వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ప్రకృతిలో లభించే ఏ పదార్థం ఏ విధంగా స్వీకరిస్తే రోగనిరోధక శక్తి పెరిగి మానవులు ఆరోగ్యవంతులుగా ఉంటారో అనే అంశాన్ని ప్రతిబింబించేలా విద్యార్థులు వారి ప్రదర్శనల ద్వారా వివరించారు. కళాశాల యాజమాన్య సభ్యుడు ప్రగడ రాజగణపతి తదితరులు విద్యార్థులను అభినందించారు.

విద్యార్థుల చేతుల్లో రూపుదిద్దుకున్న మట్టి వినాయకులు



వినాయక ప్రతిమలు తయారు చేసిన విద్యార్థులను అభినందిస్తున్న ఆచార్య దక్షిణామూర్తి

విశాఖ-లీగల్: విద్యార్థుల్లో సృజనాత్మక పెంపొందించడానికి మట్టి బొమ్మల తయారీ ఎంతో ఉపకరిస్తుందని విద్యావేత్త, గాయత్రి విద్యా పరిషత్ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.దక్షిణామూర్తి అన్నారు. బీచ్ రోడ్డులోని గాయత్రి విద్యా పరిషత్ ఎంఎల్‌బీటీ పాఠశాలలో శుక్రవారం మట్టి వినాయక ప్రతిమల తయారీ కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్ర విశ్వకళాపరిషత్ లలిత కళా విభాగం, గాయత్రి విద్యా పరిషత్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి. ఈ సందర్భంగా ఆచార్య దక్షిణామూర్తి మాట్లాడుతూ తమ పాఠశాలలో 1988 నుంచి మట్టి బొమ్మల తయారీలో శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పర్యావరణ పరిరక్షణ, బాలల్లో నైపుణ్యాలను పెంపొందించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. స్కూల్ ప్రిన్సిపాల్ కె.మధురవాణి మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణ, నైపుణ్యాల వృద్ధి, పర్యావరణ హితాన్ని కాంక్షిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమానికి వందల సంఖ్యలో బాలలు హాజరై మట్టి వినాయక ప్రతిమలు తయారు చేసినట్లు చెప్పారు. గాయత్రి విద్యా పరిషత్ సంయుక్త కార్యదర్శి ఆచార్య డి.వి.ఎస్.కామేశ్వరరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

మట్టి గణపతి విగ్రహాల పంపిణీ

ఎంవీపీకాలనీ: వినాయక చవితిని పురస్కరించుకుని శుక్రవారం ఎంవీపీ కాలనీలోని సమత కళాశాలలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. కళాశాల డీన్ ఆచార్య విజయరవీంద్ర మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలుగకుండా చవితి వేడుకలు నిర్వహించుకోవాలన్నారు. విద్యార్థుల్లో అవగాహన పెంచే దిశగా మట్టి ప్రతిమల పంపిణీ చేపట్టినట్లు తెలిపారు. విద్యార్థులు, అధ్యాపకులకు 150 మట్టి వినాయక ప్రతిమలను అందజేశారు.

ప్రజా రవాణా ఉద్యోగుల నిరసన



ఉద్యోగుల దీక్షలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

ఎంవీపీకాలనీ: వాల్తేరు డిపో మేనేజర్, యాజమాన్యం తీరును నిరసిస్తూ ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సంస్థ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. వాల్తేరు డిపో ఎదుట ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ వాల్తేరు డిపో కండెక్టర్ అక్రమ సస్పెన్షన్‌ను నిరసిస్తూ డిపో మేనేజర్ వైఖరికి వ్యతిరేకంగా దాదాపు నెల రోజులుగా ఉద్యోగులు నిరసన తెలుపుతున్నా.. యాజమాన్యం పట్టనట్లు వ్యవహరిస్తోందన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలో జాప్యం చేస్తోందన్నారు. విశాఖ డీపీటీవో కక్షపూరితంగా వ్యవహరిస్తూ కండక్టర్లు, డ్రైవర్లను అక్రమ సస్పెన్షన్లు చేసే విధంగా ఆదేశాలిస్తూ ప్రతి డిపోలో సమస్యలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆయన తీరును ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు తెలిపారు. ఉద్యోగులను ఇబ్బంది పెట్టే తీరును మార్చుకోకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనకు దిగుతామని హెచ్చరించారు. సంస్థ విశాఖ జిల్లా వాల్తేరు డిపో కార్యదర్శి వసంతరావు మాట్లాడుతూ వాల్తేర్ డిపో పరిధిలోని కండక్టర్‌ను అక్రమంగా సస్పెండ్ చేశారన్నారు. ఉద్యోగి సెస్పెన్షన్, డిపో యాజమాన్యం ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకిస్తూ కొన్ని రోజులుగా నిరసనలు చేస్తున్నట్లు తెలిపారు. కండక్టర్‌పై సెస్పెన్షన్ ఎత్తివేసి, తిరిగి ఉద్యోగ బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంస్థ జోనల్ కార్యదర్శి ఎం.వి.ఆర్.మూర్తి, జోనల్ చైర్మన్ సూర్యం, కార్యదర్శి నీలకంఠం, ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.వి.వి.మోహన్, జి.ఆర్.రావు, ఎం.వి.ఆర్.మూర్తి, బి.నీలకంఠం, పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు.

పదోన్నతి పొందిన పోలీసులకు సీపీ సన్మానం



పదోన్నతి పొందిన సిబ్బందితో పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ సిబ్బందికి ప్రమోషన్లు లభించాయి. సివిల్‌తోపాటు ఏఆర్‌లో ఉన్న హెడ్ కానిస్టేబుళ్లకు పదోన్నతులకు కల్పిస్తూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం పోస్టింగ్ ఆర్డర్లు ఇచ్చారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో మూడో విడత ప్రమోషన్ మేళా నిర్వహించారు. సిబ్బంది సంక్షేమానికి తొలి ప్రాధాన్యమిస్తున్న సీపీ కొత్త ఒరవడికి శ్రీకారం చుడుతూ పదోన్నతి పొందిన సిబ్బందిని సత్కరించారు. పదోన్నతి ర్యాంకులతోపాటుగా పోస్టింగ్ ఆర్డర్ అందజేశారు. మూడో విడతలో కమిషనరేట్‌కు చెందిన ఒక హెడ్ కానిస్టేబుల్‌కు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్‌గా, ఏడుగురు ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుళ్లకు ఏఆర్ ఎస్ఐలుగా, ఆరుగురు ఆర్మ్‌డ్ రిజర్వ్ కానిస్టేబుళ్లకు ఏఆర్ హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. వీరిని కుటుంబ సభ్యులతో ఆహ్వానించి సీపీ చేతుల మీదుగా ర్యాంకులు, పోస్టింగ్ ఆర్డర్లను స్వయంగా అందించారు. కార్యక్రమంలో జాయింట్ సీపీ కె.ఫక్కీరప్ప, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వెలమలను బీసీ-ఏలో చేర్చాలి



కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడికి సమస్యలు వివరిస్తున్న గోవిందరావు

బీచ్‌రోడ్డు: వెలమ సామాజిక వర్గ ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు ఆధ్వర్యంలో శుక్రవారం కేంద్ర విమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుకు వినతిపత్రం అందజేశారు. సర్క్యూట్ హౌస్‌లో మంత్రిని కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ వెలమ సామాజిక వర్గాన్ని బీసీ-డీ జాబితా నుంచి ఏ జాబితాలోకి మార్చాలని, తాటిపూడి జలాశయానికి గౌర్రపాటి బుచ్చి అప్పారావు నామకరణాన్ని యథావిధిగా కొనసాగించాలని కోరారు. తమ సంఘానికి విశాఖలో రెండెకరాల స్థలం కేటాయించాలని, ఆంధ్రా యూనివర్సిటీ వీసీగా ఆచార్య గొట్టాపు శశిభూషణరావును పూర్తి స్థాయిలో కొనసాగించాలన్నారు. వెలమ విద్యార్థులకు విదేశీ విద్యా సౌకర్యాలు, వెలమ రైతులకు 100% సబ్సిడీతో రుణాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యవర్గ అదనపు ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల సత్యం, విశాఖ జిల్లా ఇన్‌చార్జి రెడ్డి ఈశ్వరరావు, అనకాపల్లి ఇన్‌చార్జి బర్ల పైడం నాయుడు, వైస్ ప్రెసిడెంట్ వరుదు రాజ్‌కుమార్, చల్లా సురేష్, ఇత్తంశెట్టి అమ్మాజీ, కింజరాపు సూర్యనారాయణ, ఇత్తంశెట్టి రమేష్, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యా మండలి సమావేశంలో ఏయూ అధికారులు



వర్చువల్ సమావేశంలో పాల్గొన్న ఏయూ వీసీ శశిభూషణరావు, అధికారులు

విశాఖ సిటీ: ఉన్నత విద్యా మండలి శుక్రవారం వర్చువల్‌గా సమావేశం నిర్వహించింది. ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమానికి వీసీ ఆచార్య జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా టీమ్ లీజ్ సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ అందించడం, ఓడీఎల్ విధానంలో కోర్సుల నిర్వహణ, డిజిటల్ స్కిల్స్ తదితర అంశాలను అందించడంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సదస్సులో ఏయూ సీడీసీ డీన్ ఆచార్య టి.వెంకటకృష్ణ, దూర విద్య సంచాలకుడు ఆచార్య ఎస్.విజయ్‌మోహన్, ప్లేస్‌మెంట్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆలోచింపజేసిన నాటిక



కలిసి ఉంటే.. నాటికలోని ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజికల్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో నెలవారీ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో 'కలిసి ఉంటే' అనే నాటిక ప్రదర్శించారు. కళాభారతి ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంఎస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, కోశాధికారి పైడా కృష్ణప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. నగరానికి చెందిన రచయిత, దర్శకుడు డేవిడ్ రాజు రచించి, దర్శకత్వం వహించిన ఈ నాటిక అందరినీ ఆకట్టుకుంది. కలిసి ఉంటే కలదు సుఖం అనే సందేశంతో పూర్తి హాస్యభరితంగా సాగిన ఈ నాటిక అందరినీ ఆలోచింపజేసింది.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంఎస్ఎన్ రాజు, రాంబాబు, పైడా క్రిష్ణప్రసాద్